A.R.No. M30/661

# హంస

సారస్వత మాసపత్రిక

ఫిబ్రవరి '63

572


శ్రీ గౌతమీ గ్రంథాలయము
రాజమహేంద్రవరము

ముఖచిత్రం కథకుని కథ:

# రేఖ అనే 'బాపు'

ఆరువేల సంవత్సరాల క్రితం నుంచి భారత దేశంలో చిత్రకళ వున్నదట- అత్యున్నత స్థాయిలో, అన్ని దేశాల వారి దృష్టిని ఆకట్టే దశలో, అట్లా అని వినడం, అప్పుడప్పుడు వాటి నకళ్ళు చూడ్డడం వినా చిత్ర లేఖనం ఎట్లా జరుగుతుందో, ఆ చిత్రాల ప్రభావం చూపరుని ఏ విధంగా వశంవదుని చేసు కొంటుందో తెలియదు. ఎటొచ్చీ ఈ దశాబ్ద కాలంలోనే చిత్రలేఖనాన్ని పరిశీలించగల తృష్ణను ప్రజలలో పెంపొందింప చేయడం జరిగింది, అది 'బాపు' ద్వారా అతని చిత్రాలతోనే ప్రారంభమయింది.

పత్రికలు చదివే ఒక సాహిత్య విమర్శకుణ్ణి, అంత దీక్షగా చదువుతున్నావు- ఆ కథ అంత బావుందా అని ప్రశ్నిస్తే అబ్బే కథ కాదు, బాపు బొమ్మను చదువుతున్నాను అని అతను ఠక్కున జవాబిస్తాడు.

ఏం విటీ అంత బావుంటాయా బాపు బొమ్మలు అని ఎవరయినా ప్రశ్నించే వారు ఇవాళ ఎక్కడయినా వున్నారు. అంటే వాళ్ళు పిచ్చాసుపత్రి నుంచి పారిపోయి వచ్చినవాళ్ళయినా అయివుండాలి. లేదా సంస్కార విజ్ఞానాలను గతులు తప్పించిన వాళ్ళయినా అయివుండాలి.

అవును, ఇవాళ కొన్ని పత్రికలు అధికంగా అమ్ముడుపోతున్నాయి అంటే బాపు బొమ్మలే అందుకు కారణం అని నిస్సంకోచంగా చెప్పవచ్చు. ఆ సాహిత్య విమర్శకుడన్నట్టు కథ కంటె చిత్ర కథనే చదువుకోవలసి వస్తున్నది.

బాపు చిత్రాలలోని పడుచు అమ్మాయిలను అబ్బాయిలను చూస్తూవుంటే, ఆఁ అతిశయోక్తి! ఇంత అందమైన అమ్మాయిలు, అబ్బాయిలు వాస్తవ జీవితంలో మన కళ్ళముందు ఎప్పుడయినా కనుపిస్తున్నారా అని అనిపించవచ్చు. లేరు. నిజమే- కాని, ఇప్పు డిప్పుడు బాపు బొమ్మల మోడల్ అమ్మాయిలూ, అబ్బాయిలూ తయారవుతున్నారు! చిత్రాలకు మోడల్స్‌ను ఎన్నుకోవడమే

పేరుగుదుం కాని, ఒక చిత్రకారుని బొమ్మల మోడల్స్‌గా మనుషులు వుండ డానికి ప్రయత్నించడం విచిత్రం కదూ! ఆ విచిత్రాన్ని బాపు చిత్రాలు నిజం చేస్తున్నాయి మరి! బాపు అదుగో ఆ కథా చిత్రంలో గీసిన అమ్మాయిలా సున్నితంగా సుకుమారంగా నేనూ వుండాలి, అదుగో ఆ ఫలానా బాపు చిత్రంలో అబ్బాయివలె ఆరోగ్యంగా అందంగా నేనూ వుండాలి అని నేడు యువతీ యువకులు బాపు చిత్రాలవలె వుండడానికి ప్రయత్నంచేస్తున్నారు అంటే ఆశ్చర్యం లేదు. ప్రాణం వున్న మనుషులకే మోడల్స్ అయిన బాపు చిత్రాలు అంత నాగరీక మయినవి, అంత సంస్కారం గలవి, అంత సాంస్కృతిక మైనవి.

బాపు చిత్రాలలో జీవం వుట్టిపడుతూ వుంటుంది. కళ్ళలో కాంతి, ముఖంలో తేజస్సు, ఆకృతిలో సౌష్ఠవం పుష్టిగా వుండి నిండయిన రూపంతో నిలువెత్తు మనిషి, మనిషిలో మనిషి సాక్షాత్కరిస్తూ వుంటాడు. ప్రతి రేఖలో, ప్రతిమలుపులో, ప్రతికోణంలో, ప్రతికదలికలో చైతన్యం తొణికిసలాడుతూ సజీవ మానవుని పున ర్దర్శన మవుతూ వుంటుంది.

బాపు చిత్రాలు ఈ విధంగా ఇంకొక దశాబ్దకాలంపాటు విరివిగా ప్రచురితమయి ప్రాచుర్యమందితే తెలుగుజాతి రూపురేఖలు దీప్తి చెందవచ్చు. ప్రపంచంలోనే తెలుగువారు సౌందర్యవంతులని అనిపించుకోవచ్చు. జాతి మొత్తం రూపు రేఖ విలసనాలలో రీజనరైజ్ అవుతుంది. మానసికంగా ఇది సాధ్యం అని చరిత్ర రూపించింది కూడా.

శ్రీ నవయుగ నరసయ్యగారు సినిమా పబ్లిసిటీతో కొత్తపుంతలు తొక్కారు అంటే, వారి వెనుక బాపు బలం వున్నదన్న మాట. నేడు కొందరు యువ చిత్రకారులు కమర్షియల్ ఆర్ట్‌లో ప్రఖ్యాతి గాంచుతున్నారు అంటే, వారికి బాపు గురుత్వం వున్నదన్నమాట. సరాగం, నీలిమ నగైరాలు కొందరు కూడా పత్రికల చిత్రాలలో తమ చాతుర్యానికి మెరుగులు దిద్దుకొంటున్నారు అంటే, బాపు ప్రభావం వారిపై అధికంగా వున్నదన్నమాట. పత్రికల ముఖచిత్రాలు ముచ్చటగా ముద్దులొలుకుతున్నాయి అంటే, బాపు ఇండియన్ ఇంక్ ఏ మూలనో ఒక డాట్ పడివున్నదన్నమాట. పుస్తక ప్రచురణకర్తలు, ఫిలిం ప్రొడ్యూసర్లు తమ స్క్రిప్టులు బాపు చేతికి అందిస్తున్నారు అంటే, తమ లాభాలకు బాపు ఒక దిక్సూచి అన్నమాట. అంతెందుకు ప్రఖ్యాత తైలవర్ణ చిత్రకారులు సయితం

ఇవాళ రేఖా చిత్రాలను గీస్తున్నారు అంటే, బాపూ గీత వారి హృద్గీత అయిందన్న మాట!

బైది బై - పశ్చిమ గోదావరి జిల్లా కంతేరు అనే ఒకానొక మారుమూల కుగ్రామమందు 1934 డిసెంబర్ 15 తేదీన బాపు వురఫ్ సత్తిరాజు లక్ష్మినారాయణ లేక రేఖ అనే ఎలిటిల్ క్రియేటర్ జననమొందెనంటా, బీ కామ్ చతికి బీ యల్ పట్టా ఒకదానిని ఒత్తుకు పెట్టుకొనెనంటా, తన పదవ ఏటనే న్యాపతి రాఘవరావు అనే బాలన్నయ్య బాలక్కయ గారల 'బాల' పత్రికలో 1945 నుంచే గాడ్ క్రియేట్ ద ఓషన్ చేయడం ప్రారంభించెనంటా, ఇంతా చేస్తే ఇతని కిప్పుడు ఇరువది ఏడవ ఏడు అయి వుండెనంట.

బాపు చిత్రకళా ప్రదర్శనం మొట్టమొదటసారిగా 1962 జులైలో సెవెన్ స్టార్స్ సిండికేట్ వారి ఆధ్వర్యాన హైదరాబాద్‌లో జరిగింది. రెండవసారి విజయవాడలో మొదటిసారి -1963 జనవరి 26 వ తేదీ రిపబ్లిక్ దినోత్సవం నాడు విజయవాడలో ప్రత్యేక కమిటీ వారి ఆధ్వర్యాన ఏర్పాటయింది. ఈ సందర్భంలో బాపు చిత్రాలను వివరించే ఒక సావనీర్ కూడా వెలువడింది. ఎగ్జిబిషన్‌కు ప్రఖ్యాత నటులు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు ప్రారంభోత్సవం చేశారు. ఫిలిం ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన ఈ చిత్రకళా ప్రదర్శనను కొన్ని వేలమంది పరికించారు. తిలకించారు, తల లూపారు. ఈ చిత్రకారుడు తెలుగువాడైనందుకు గర్వించారు. కాని ఈ ఎగ్జిబిషన్‌లో రెండువేల అతని పాత చిత్రాలతోపాటు మరికొన్ని కొత్త చిత్రాలు కూడా వుంచితే ఇంకెంతో బావుండేది.

అయినా చిత్రాలకు పాతేమున్నది! అందునా అవి బాపు చిత్రాలాయె! అంటే అవెప్పుడు శాశ్వతత్వాన్ని సంతరించుకొన్న శతాబ్దాల సజీవ కళా ఖండాలే, నిత్య నూతనాలే!

బాపుకు దీటయిన సాటయిన వారు భారతదేశంలో మరొక రున్నారు. ఆ మరొకరి పేరు వాపు!

—అడ్డుమిల్లి

